క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి ఆలయంలో గురువారం సహస్ర తులసిపూజను శాస్త్రోక్తంగా జరిపించారు. పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించాలని ఈవో శిరీష తెలిపారు.

గురజాడ రచనలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

మహారాణిపేట : మహాకవి గురజాడ రచనలు విజ్ఞాన భాండాగారాలని వక్తలు పేర్కొన్నారు. మహాకవి గురజాడ వర్థంతి సందర్భంగా గురువారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణమైన టర్నర్ సత్రంలో అరసం ఆధ్వర్యంలో సాహితీ సభ నిర్వహించారు. ముందుగా గుజ్జు వెంకటరెడ్డి రచించిన సంస్కృతి–సంస్కారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు కథా రచయిత ఎస్. హనుమంతరావు అధ్యక్షత వహించగా గురజాడ కథలు–సంస్కరణ దృక్పథం అంశంపై డాక్టర్ క్షేత్రపాల్, కన్యాశుల్కం–సామాజిక దృక్పథంపై అడపా రామకృష్ణ, గురజాడ కవిత్వంపై ఆచార్య డీవీ సూర్యారావు, వెలమల సిమ్మన్న మాట్లాడారు. పాఠ్య పుస్తకాల్లో మత సంబంధిత సాహిత్యాన్ని పొందుపరచడం వల్ల యువతరంలో కులమతాల సంకుచితత్వం ప్రబలుతుందని ఆనాడే గురజాడ గ్రహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, పి. శ్యాంసుందర్, పి.ఎ. రాజు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి

అల్లిపురం : మైనర్లకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు తప్పు చేయొద్దని టూటౌన్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీలక్ష్మి సూచించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి భీమ్‌నగర్‌లో గురువారం సాయంత్రం ఆమె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. అదే విధంగా చిన్నపిల్లలను ఆటోల్లో స్కూళ్లకు పంపొద్దన్నారు. ఒకవేళ పంపినా పరిమితికి మించి పిల్లలను ఆటోల్లో తరలించకుండా చూసుకోవాలన్నారు. డ్రైవర్‌కు లైసెన్స్ ఉందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. ఇటీవల సంగం శరత్ జంక్షన్ వద్ద జరిగిన ఆటో ప్రమాదాన్ని ఉదాహరణగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భీమ్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు

డాబాగార్డెన్స్ : చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని పోర్టు అధికారులన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీలో ఈసీ చార్జి హ్యాండ్‌గా పని చేసిన కచ్చళ్ల రాము గురువారం పదవీ విరమణ చేశారు. పలువురు అధికారులు, ఉద్యోగులు రాము దంపతులను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన సేవలను కొనియాడారు.

నాడు

గ్రంథాలయాలు అరకొర వసతులతో కొనసాగేవి. పాఠకులు, పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు కోరే పుస్తకాలను సమకూర్చే విషయంలో జాప్యం జరిగేది. పోటీ పరీక్షల పుస్తకాలు పూర్తిగా దొరికేవి కావు. గ్రంథాలయాల నిర్వహణకు అవసరమైన నిధులు సైతం అరకొరగానే కేటాయింపులు జరిగేవి.

అల్లిపురం శాఖా గ్రంథాలయం ఉద్యోగార్థులు, పాఠకులకు చక్కటి సేవలందిస్తోంది. పోటీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థుల కోసం ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు పొందుపరిచారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసింది. దీంతో అందరూ కోరుకునే గ్రంథాలు ఇక్కడ లభ్యమవుతున్నాయి.

నేడు

అన్ని రంగాలతో పాటు గ్రంథాలయ రంగానికి ప్రభుత్వం నుంచి చక్కటి చేయూత లభిస్తోంది. అన్ని పోటీ పరీక్షల గ్రంథాలు విద్యార్థులకు లభ్యమవుతున్నాయి. చక్కటి వాతావరణంలో గ్రంథాలయాల నిర్వహణ జరుగుతోంది. కొత్త గ్రంథాల కొనుగోలుకు త్వరితగతిన ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుండడంతో పోటీ పరీక్షలు రాసే వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞాన వనం



- ప్రభుత్వ లక్ష్యం దిశగా దూసుకుపోతున్న గ్రంథాలయాలు
- పాఠకుల సేవలో అల్లిపురం రీజినల్ లైబ్రరీ
- కొలువులు సాధించిన పలువురు విద్యార్థులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అల్లిపురం : వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలు గ్రంథాలయాలు. సాహిత్యాభిలాషులు, ఉద్యోగార్థులకు గ్రంథాలయాలు చేస్తున్న సేవలు ఎంతో అమూల్యమైనవి. అటువంటి గ్రంథాలయాలు నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్నాయి. చాలా గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అయితే అల్లిపురంలోని బాయమ్మ జంక్షన్‌లో గల ప్రభుత్వ గ్రంథాలయం మాత్రం ప్రభుత్వ సహకారంతో నిత్యనూతనంగా కొనసాగుతోంది. సాహితీ గ్రంథాలు, ఉద్యోగార్థులు పరీక్షలకు సిద్ధమయ్యే కాంపిటీటివ్ పుస్తకాలతో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ వస్తోంది 1981లో ఈ గ్రంథాలయం ప్రారంభం అయింది. తొలుత అద్దె ఇంట్లో ఉండే గ్రంథాలయం అనంతరం అమ్మవారివీధిలోని జీవీఎంసీ కమ్యూనిటీ భవనంలోకి మారింది. అనంతరం బంగారుమెట్టలోని బాయమ్మ జంక్షన్‌లో కొత్తగా నిర్మించిన రెండస్తుల భవనంలోకి మారి అక్కడే కొనసాగుతోంది.

విద్యార్థులకు దిక్సూచిగా..

అల్లిపురం శాఖా గ్రంథాలయం విద్యార్థులకు దిక్సూచిలా సేవలందిస్తోంది. ఉద్యోగాలు సాధించేందుకు పోటీ పరీక్షలు రాయాలనుకునే వారి కోసం ఇక్కడ వేలాది రూపాయలు వెచ్చించి అనేక పుస్తకాలు పొందుపరిచారు. విలువైన సమాచారం నిక్షిప్తం చేసిన ఆ గ్రంథాలు చదువుకుని ఇప్పటికే ఎంతో మంది కోరుకున్న కొలువులు సాధించారు.

7200 పైచిలుకు పుస్తకాలు..

జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా అల్లిపురం బాయమ్మ జంక్షన్‌లో ఈ గ్రంథాలయం కొనసాగుతోంది. ఇక్కడ 7,458 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు తెలిపారు. వాటిలో తెలుగు 6,509, ఇంగ్లీష్ 714, హిందీ 215, ఉర్దూ 2, ఇతర భాషల పుస్తకాలు 18 ఉన్నాయన్నారు. వాటిలో నవలలు 2,200, పిల్లల సాహిత్యం 1,300, ఆధ్యాత్మిక పుస్తకాలు 400, కథల పుస్తకాలు 1,000, సైన్సు పుస్తకాలు 300, జీకే పుస్తకాలు 200, టెక్స్ట్ పుస్తకాలు 400, ఇతర పుస్తకాలు 358 ఉన్నాయని తెలిపారు. త్వరలో మరికొన్ని పుస్తకాలు చేర్చుతామని తెలిపారు.

తెరిచి వుండే వేళలు..

ఈ గ్రంథాలయం ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి వుంటుంది. పేపరు విభాగం దిగువ భాగంలోను, పుస్తక విభాగం మేడపైన నడుపుతున్నారు. ప్రతి శుక్రవారం సెలవు దినం. మిగిలిన రోజుల్లో కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధపడే వారు కోరితే పుస్తక విభాగం తెరచి ఉంచుతారు. పాఠకులు నవలలు ఇంటికి తీసుకెళ్లి చదువుకునేందుకు వెసులుబాటు కల్పించారు. అందుకు గాను రూ.100 డిపాజిట్ తీసుకుని అందజేస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాయాధికారి కోరుతున్నారు.



అల్లిపురం శాఖా గ్రంథాలయం



కాంపిటీటివ్ పుస్తకాలు చదువుకుంటున్న విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తకాల వివరాలు	
తెలుగు	6,509
ఇంగ్లీష్	714
హిందీ	215
ఇతర భాషల పుస్తకాలు	18
నవలలు	2,200
పిల్లల సాహిత్యం	1,300
ఆధ్యాత్మిక పుస్తకాలు	400
కథల పుస్తకాలు	1,000
సైన్సు పుస్తకాలు	300
జీకే పుస్తకాలు	200
టెక్స్ట్ పుస్తకాలు	400
ఇతర పుస్తకాలు	358



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు



పేపర్ సెక్షన్‌లో పాఠకులు

పాఠకులు కోరిన పుస్తకాలు రప్పిస్తాం..



కాంపిటీటివ్ పరీక్షలు రాసే విద్యార్థులు, సాహితీ గ్రంథాలు చదివే పాఠకులు తమకు కావాల్సిన పుస్తకాల వివరాలు తెలియజేస్తే వాటిని కూడా సమకూరుస్తాం. ఈ మేరకు గ్రంథాలయ శాఖ చైర్‌పర్సన్ కొండా రమాదేవి ఇప్పటికే నిధులు కేటాయించారు. అందరూ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి.

–పీవీఎస్ రాజు, గ్రంథాలయాధికారి

పోటీ పరీక్షల మెటీరియల్ లభిస్తుంది..



నేను ఎస్ఐ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. అందుకు కావాల్సిన మెటీరియల్ అల్లిపురం శాఖా గ్రంథాలయంలో దొరుకుతుంది. ఇంకా మెటీరియల్ అవసరమైతే రప్పిస్తామని చెప్పారు. గ్రంథాలయం అందుబాటు సమయంలో నడుస్తోంది. మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది.

–గార వాసు, అల్లిపురం

ఇక్కడ ప్రిపేరై కొలువు సంపాదించా..



ఈ గ్రంథాలయంలో ఉన్న కాంపిటీటివ్ పుస్తకాలు చదువుకుని పరీక్షలకు హాజరయ్యాను. మంచి మార్కులు సంపాదించాను. దీంతో నాకు విజయనగరం కోర్టులో ఎల్‌డీసీగా ఉద్యోగం వచ్చింది. నిరుద్యోగులందరూ తప్పనిసరిగా దేవాలయాల వంటి గ్రంథాలయాలను వినియోగించుకుని ఉద్యోగాలు సంపాదించాలి.

– కె.సంధ్య, అల్లిపురం

అందుబాటులో అన్ని రకాల పత్రికలు..



శాఖా గ్రంథాలయంలో డైలీ, పక్ష, మాస పత్రికలు లభిస్తున్నాయి. ఇక్కడికి వచ్చి అన్ని రకాల దినపత్రికలు చదువుకోగలుగుతున్నాం. ఈ గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకుంటే బాగుంటుంది. నేను ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి పత్రికలు చదువుతుంటాను.

– కేవీఎల్ఎన్ రెడ్డి, విశ్రాంత రైల్వే ఉద్యోగి

ఉద్యోగం సంపాదించా..



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. ఇక్కడే చదువుకుని పోటీ పరీక్షలు రాసి పాసయ్యాను. తద్వారా జిల్లా కోర్టులో ఉద్యోగం సంపాదించాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగపడుతోంది. అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. లేని పుస్తకాలు చెబితే రప్పిస్తారు కూడా.

– జి.చిన్నా, అల్లిపురం

సీఎం జగన్‌తోనే సంక్షేమం



చిలకవీధి వద్ద జెండా ఎగురవేస్తున్న కొల్లి సింహాచలం తదితరులు



రామకృష్ణా వీధిలో ప్రజలకు బ్రోచర్లు అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ : రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడిపిస్తున్నారని జీవీఎంసీ 39వ వార్డు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం అన్నారు. గురువారం చిలకవీధి వద్ద జెండా ఎగురవేసి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లంచాలకు తావు లేకుండా ప్రజలకు పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అందుకే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి సనపల రవీంద్ర భరత్, జీవీఎంసీ ఏపీడీ పుణ్యవతి, నల్లబాబు, బాబ్జి, సలీం, ఆది, సతీష్, ఆదిలక్ష్మి, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, జీవీఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణా వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం గాజులవీధిలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు గౌరీశంకర్, మంగరాజు, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలువలు శుభ్రం చేయాలి



టౌన్‌కొత్తరోడ్డు వద్ద కాలువలు శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : ప్రధాన రహదారుల్లో కాలువలు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డు వద్ద రహదారులు, కాలువలను పరిశీలించారు. టౌన్‌కొత్తరోడ్డు వద్ద మురుగుతో నిండిపోయిన కాలువను శుభ్రం చేయించారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు సిబ్బందితో ప్రతిరోజు రహదారులు, కాలువలు శుభ్రం చేయించాలన్నారు. దాంతో ఆ ప్రాంతంలో దోమలు వ్యాప్తి చెందవన్నారు. ఉదయాన్నే పారిశుధ్య కార్మికులతో పనులు చేయించాల్సిన బాధ్యత శానిటరీ సెక్రటరీలదే అన్నారు.

ప్రేమ సమాజం పిల్లలకు వాటర్ ప్లాంట్ వితరణ



ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బుద్ధా శివాజీ

డాబాగార్డెన్స్ : ప్రేమసమాజంలోని ప్రేమ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గంగవరం పోర్టు సీఈవో బీజీ గాంధీ 100 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో వాటర్ ప్లాంట్‌ను గురువారం అందజేశారు. వాటర్ ప్లాంట్‌ను ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు కె. నరసింహమూర్తి, కోశాధికారి ఎంవీవీకే గుప్తా, మాజీ కార్యదర్శి కోన జగదీశ్వర రావు, సంయుక్త కార్యదర్శి గౌరీ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు కె. కృష్ణారావు, పి. గణపతిరావు, ప్రేమా హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె. రామలక్ష్మి, ప్రాథమిక స్కూల్ అధ్యాపక సిబ్బంది, పాఠశాల పిల్లలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ స్ఫూర్తితో ముందుకు

34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి



అచ్చియ్యమ్మపేటలో మహిళతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి రోజుకి ఒక వలంటీర్ పరిధిలో గల 50 ఇళ్లకు స్వయంగా వెళ్లి వారితో మమేకమవుతున్నారు. దీంట్లో భాగంగా గురువారం అచ్చియ్యమ్మపేట సచివాలయం పరిధిలో వలంటీర్ నిషా, కన్వీనర్ గోవింద్‌తో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు తాను కార్పొరేటర్‌గా కృషి చేస్తానని తెలిపారు. వార్డు ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు విన్నవించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట వార్డు నాయకులు లండా రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

సీతమ్మధార: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడం కోసం ప్రతి నెలా విద్యా శాఖ మండలి పరిధిలోని ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ శిక్షణ లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తోందని సీతమ్మధార మండల విద్యా శాఖ అధికారి డి.రామారావు తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో రెండో రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో 132 మంది ఉపాధ్యాయులకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు విద్యా పరంగా మిగిలిన ఉపాధ్యాయులతో చర్చించి తగు రీతిలో బోధించడానికి దోహదపడుతుందన్నారు. సీతమ్మధార మండల పరిధిలోని 25 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పలు సూచనలిచ్చారు. మండల రిసోర్స్ పర్సన్ రేణుకా దేవిజగన్, సీఆర్పీ రాధ, ప్రధానోపాధ్యాయులు చిలకా రమణా పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నప్రసాదం వడ్డిస్తున్న డాక్టర్ రమణమూర్తి

అల్లిపురం : అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, అటువంటి అన్న ప్రసాదాన్ని ప్రతి వారం భక్తులకు అందజేస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సేవలు కొనియాడదగ్గవని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పీవీ రమణమూర్తి అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన అన్నసమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అంతకు ముందు ఆయన అమ్మవారికి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బడే నాగరాజు, సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, వాసుపల్లి నర్సింగ్, తమరాపు మధు పాల్గొన్నారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలకు వీల్ లాక్



అంబేడ్కర్ సర్కిల్ వద్ద వాహనాలకు వీల్‌లాక్ వేసిన సీఐ సూరినాయుడు, సిబ్బంది

అల్లిపురం : రోడ్లపై నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపితే వీల్ లాక్ చేయబడుతుందని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ సీహెచ్ సూరినాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన డాబాగార్డెన్స్‌లోని బస్టాపులు, రోడ్లపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తే వీల్ లాక్ చేస్తామని హెచ్చరించారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ ఎస్ఐలు సత్యనారాయణ, కె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

సీతమ్మధార : ఉద్యమాలు, పోరాటాల ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కె.వనజాక్షి, ఎం.డి. బేగం అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరంలో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమయిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాళ్లు దేవుడమ్మ, ఎస్.కె.మస్తాన్, కె.పద్మ, బి.పుష్పలత, అరుణగాయత్రి తదితరులు పాల్గొన్నారు.